# పండుగనాడు

ఆ పండుగకు మా పెద్దక్కయ్యా వాళ్ళింటికి వెళ్ళక తప్పిందికాదు.

"ఇంతదూరం ఇప్పు డెందుకే మరోసారి వస్తాను" అని వ్రాసినా అది ఒప్పుకోలేదు. రాక తప్పదంటూ ఉత్తరాలపై ఉత్తరాలు. "మీ అల్లుడి పుట్టినరోజుకూడా ఆరోజే అయ్యింది. అటు పండుగా కలిసివస్తుంది. ఏమైనా ఈసారి నువ్వు రాక తప్పదు. వాడి కేమైనా కొనిమ్మని నీవు పంపిన పైకం అందింది. కాని నువ్వుకనుక రాకపోతే — రేపూ ఎల్లుంటిలో బయలుదేరి వస్తున్నట్లు నీ దగ్గరనుంచి ఉత్తరం కనుక రాకపోతే— ఆ డబ్బు వెంటనే తిరక్కొట్టేస్తానంటున్నారు మీ బావ. నువ్వు రాకపోతే నాకు కష్టంగలిగేసంగతి అల్లా ఉంచు. ముందు మీ బావకు నీమీద నిజంగా కోపం వచ్చేస్తుంది" అంటూ దీర్ఘమైన జాబు వ్రాసి, నన్ను ఒత్తిడి చేసింది మా పెద్దక్కయ్య. దానికి నేనంటే ఎందుకో చెప్పలేనిఅపేక్ష. 'మా పెద్దతమ్ముడు

పట్టి అమాయకుడండీ, అని అంటుంది అందరితోనూ. నేను పెద్ద వాణ్ణయి, ఎమ్మే అయినా దాని దృష్టిలో నేనింకా అమాయకుణ్ణే. వెళ్ళానా ఇక నన్ను ఓపట్టాన కదిలి రానివ్వదు. వెళ్ళి వెళ్ళడంతోటే తలకు నూనె పట్టించేసి "ఒరేయి నువ్వు తలంటి పోసుకొని ఎన్ని నెలలయిందిరా" అంటూ గంటసేపు తలరుద్ది రెండు గంగాళాలనీళ్ళు పొయ్యాల్సిందే. ఉన్న నాలుగు రోజులూ ఎంతసేపూ దానికి నా విషయమే. నా ఆరోగ్యం, నా తిండీ, నా బట్టలూ... ఒకటేమిటి సమస్త విషయాలూ కనుక్కోవలసిందే. "ఎందుకే అక్కయ్యా నీకింత ఇది! ఇప్పుడు పెద్దవాణ్ణయినాను గదటే" అంటే "నీ మొహం" అంటుంది. ఏదో యాంత్రికంగా గడచిపోయ్యే సాధారణ జీవిత వాతావరణంనుంచి ఒక్కసారి — ఇంత ప్రేమ, ఇంత ఆప్యాయత వెల్లివిరిసే వాతావరణంలోకి రావడం అంటే నా కేదోలా ఉంటుంది. అందుకే కొన్నిసార్లు అక్కడకు వెళ్ళడం తప్పించుకొన్నాను. కాని ఈసారి వెళ్ళక తప్పింది కాదు.

నాలుగు రోజులు శెలవు సంపాదించి వస్తున్నానని ముందుగా వ్రాశాను. నేను వెళ్ళాక రెండో రోజున వెళ్తానని ప్రయాణమైతే అది ఎల్లాగో "ఈ పూట మంచిదికాదు. రేపు వెద్దువుగాన్లే" అని అనకమానదు. సరే పోన్లే అని ఉండిపోయి ఆ మర్నాడు బయలుదేరితే "ఒరేయి నా మాట విని అల్లా

వెళ్ళి మీ ఆఫీసుకో టెలిగ్రాం యిచ్చిరా యివ్వాళ్ళ రావడం లేదని. రేపు సాయంత్రం వెళ్దువుగాన్లే" అంటుంది. ఎందుకో చెప్పదు. ఎందుకే అంటే "నన్నూరికే విసిగించకు రా. చెప్పాగా రేపు వెళ్ళొచ్చని" అంటుంది. నన్ను అంత దూరం నుంచి పిలిపించినందుకు మరో చిన్న పిండివంట చేసిపెట్టుకోని, తలంటిపోసి పండగ చెయ్యాలని దాని ఆరాటం. ఇదంతా మామూలే. దాన్ని చూడంగానే నాకూ, నన్ను చూడంగానే దానికీ హృదయం పొంగిపోతుంది. తిరిగి వచ్చేసేటప్పుడు నా మనస్సుకు ఎంత కష్టంగా ఉంటుందో! ఇదీ ఒక కారణంగా నేను అక్కడికి వెళ్ళడం తప్పించుకొంటూ వచ్చాను. కాని ఈసారి వెళ్ళక తప్పింది కాదు.

* * * * *

నేను గుమ్మంలో దిగేసరికి మా అక్కా వాళ్ళిల్లు చాలా క్రొత్తగా అందంగా కన్పించింది. ఇంటికి వెల్ల వేయించారు. తలుపులకూ, కిటికీలకూ, రంగులు వేయించారు. పెళ్ళివారిల్లులా ఉన్నది. మా బావగారు కొంచెం దర్జామనిషి. ఆయన స్వయంగా తహసీలుదారు కాకపోయినా అంతకు మించి దర్జాగా కన్పిస్తాడు. ఆయన తహసీలుదారుగారి ముద్దుల కొడుకు. మంచి ఆస్తిపరుడు. చిన్నప్పటినుంచికూడా చాలా హుందాగా గడిపిన వ్యక్తి ఆయన.

బండి దిగంగానే నా మేనల్లుడు "అమ్మోయ్ పెద మామయ్యొచ్చేడేయ్!" అని కేక పెట్టాడు — అందరికంటె ముందుగా నా దగ్గరకు పరుగెత్తుకు వస్తూ. వాడి మాటలు విని కాబోలు మా అక్కయ్య గబగబా వరండాలోకి వచ్చింది. వరండా దాటి వీధిగుమ్మంలోకి కూడా వచ్చేసింది. మా బావ వరండాలోనే నిల్చుని "అవన్నీ వాడు తెస్తాడులే నువ్వురా" అంటున్నాడు. "ఇదేనా రావడం" అంటూ పొంగిపోయింది మా అక్కయ్య. "రావేమో అనుకొన్నారా. మొత్తంమీద వచ్చేశావు" అంటూ నా చేతిలోని సంచి తానందిపుచ్చుకొని లోపలకు నడిచింది. నన్ను చుట్టేసు కొంటున్న మా అల్లుణ్ణి ఎత్తుకొని నేనూ దానివెంట వస్తుంటే మమ్మల్ని దగ్గరకు రానిచ్చి "ఎందుకురాడే – ఊహూ మనం రమ్మనడం మరి రాక పోవడమున్నా – ఎన్ని గుండెలుండాలి?" అన్నాడు మా బావ మీసంకొనలను మునివేళ్ళతో తాకుతూ. మా అక్కయ్య "ఇక్క డెవ్వరూ దొరగార్ని చూచి హడలిపోవడం లేదులెండి" అంటూ సన్నగా మూతి విరుస్తూ ఆయనకు సమాధానం చెప్పి "రారా ఆయన మాటల కేంలే — ముందు లోపలకు పద. వెళ్ళి స్నానాల గదిలో వేడి నీళ్ళున్నాయి "ముఖం కాళ్ళూ చేతులూ కడుక్కొని రా" అన్నది నాతో.

మా అక్కయ్య కాఫీ ఇస్తే మా అల్లుడు "మామయ్యా ముందు ఈ బిస్కట్లు తిని ఆ తర్వాత ఆ కాఫీతాగు" అన్నాడు.

కాఫీ త్రాగుతుండగా టిన్ను మూతతీసి "ఓ సిగరెట్టు కూడా ముట్టించుకోన్నావా మహాదివ్యంగా ఉటు దోయ్" అన్నాడు మా బావ "ఆ పాడు అలవాట్లన్నీ మీకుగాని మా తమ్ముడికేం లేవు" అన్నది మా అక్కయ్య. కాఫీ తాగంగానే నా తలంటి ప్రియత్నం మొదలు పెట్టిందది.

"ఏమేవ్ ఈ పూట భోజనాలు ఉన్నాయా లేవా? ఎంత సేపు మీ తమ్ముడి తలంటి-అయినా ఒక్కసారే తెల్లబడి పోడులే ఓహోహో అదా సంగతి ఇప్పుడు తెలిసిందిలే - మా చెల్లెల్ని యిచ్చి చేసుకుందామని చూస్తున్నావు కాబోలు" అని మా బావ స్నానాల గది దగ్గరకు పనివేళావచ్చి, అని వెళుతుంటే మా అక్కయ్య వెంటనే అందుకొని "పదివేలిచ్చినా మా తమ్ముడేం చేసుకోడు. మాకేం అక్కర్లేదులెండి. అది ఒట్టి గడుగ్గాయ్" అన్నది.

భోజనాలప్పుడు మా బావ వంటావిడతో "మా బావమరిదికి చాలా భిడియం, కాస్త అడిగి కనుక్కోండి. సరిగా అడిగి వడ్డించకపోతే కడుపునిండా తినడు - అందుకే అల్లా బక్కగా తయారవుతున్నాడు" అని అంటే మా అక్కయ్య "పోనీలెండి వాడు బక్కగా అవుతుంటే మీరూ మీ చెల్లమ్మా అడ్డం........" అని అనేసి నవ్వింది.

మా బావ కొంచెం లావు అయినమాట నిజమే కాని మా అక్కయ్య ప్రస్తావించిన ఆ రెండో వ్యక్తి విషయం మాత్రం

నిజంకాదు. అయినా మా బావ ఎందుకో ఏమీ అనకుండా ఊరుకొన్నాడు ఒక్క క్షణం.

మా అక్కయ్య నాకు ఇష్టమని గారెలూ, మా బావ కోసరమని బొజ్జప్పాలూ చేయించింది. మా అల్లుడికి చేగోడీలు తాను స్వయంగాచేసింది. పంతంపట్టి నాకు మరో రెండు బొజ్జ ప్పాలు వేయించాడు మా బావ. కుఱ్ఱవాడు - వాడికీ పంతమే ఇన్ని చేగోడీలు తెచ్చి విస్తట్లో వేసి తింటేగాని వీల్లేదంటూ ఎంగిలిచేత్తో, మొండి మొలతో నాముందు కూర్చున్నాడు. నాకు ఆ పూట భోజనం కొంచెం బరువయ్యింది.

ఓగారె వదిలేసి లేచి వెళ్ళి చెయ్యి కడుక్కొన్నాను. "మీరిద్దరూ కలిసి వాణ్ణి ఆగారె ముట్టుకోనివ్వలేదు గదా" అంటూ మా అక్కయ్య నెమ్మదిగా అంటే "ఎందుకే నుగు తావూ-రాత్రికీ రేపటికీ పెట్టుకొందువుగాన్లే బెంగపెట్టుకోకు- లేకపోతే ఒక పనిచెయ్యి - చిక్కం..." అని నవ్వుతుంటే మా అక్కయ్య "వాడికెందుకూ ఓ రెండు రోజుల్లో మీ చెల్లాయి వస్తుందిగా - ఉంచుతాన్లెండి" అన్నది.

నన్ను అసలు మాటాడనీయ లేదు.

సాయంత్రం అయిదయినాకూడా ఇంకా భుక్తాయాసం తీరిందో లేదో అని అనుమానంగా ఉన్నది "చూడూ మీ తమ్ముడు మాంచి ఆకలిమీద ఉన్నాడు ఆగుక్కెడు నీళ్ళు ఏ మూలకి వస్తాయ్ లోపలకు తీసికెళ్ళి తాపీగా ఏం కావాలో

అడిగి పెట్టించు" అన్నాడు మా బావ తను ఖాళీచేసిన టీ కప్పు బల్లమీద పెడుతూ.

"మరి మీసంగతో" అని మా అక్కయ్య అంటే "ఆయన కా అబ్బేద్దు - ఒక్క సొజ్జప్పాలు తప్ప - ఆ వారా ఈ వారా అందులో లాగేస్తారు" అన్నాన్నేను.

ఆరు గంటలకు మా అల్లుడు తనతోపాటు అన్నానికి రమ్మంటే అబ్బే ఆకలిలేదన్నాను.

అంతా అట్లా అన్నవారే కాని తర్వాత ఏడు గంటలకు మేం అందరమూ మామూలుగానే భోజనాలు చేశాం.

ఆపూట మొదటి ఆటకు సినిమాకు పోదామని అనుకొన్నాం గాని "మొదటిఆట రద్దీగా ఉంటుంది-వద్దు-అంతగా అయితే రెండో ఆటకు వెళదాంలే" అన్నాడు మా బావ. భోజనాలయ్యాక ఇక ఆపెసక్తి తీసుకొని రాలేదు. మా అల్లుడు నేను తెచ్చిన క్రొత్తలాగూ, క్రొత్తచొక్కా తొడుక్కొని వాటితోనే నిద్రపోయాడు.

ముందు వరండాలో మా బావ పడక కుర్చీలో నడుం వాల్చి సిగరెట్టు ముట్టించి నెమ్మదిగా లోకాభిరామాయణం మొదలు పెట్టారు. మా అక్కయ్య లోపలకు వెళ్ళి నౌకర్లకు, వంటమనిషికీ ఇంటికి పట్టుకుపోయేందుకు పిండివంటలవీ సర్ది ఇవ్వడం మొదలైన చిల్లర పనులన్నీ చూచుకొంటున్నది. "ఆ గారెలు అల్లా ఉంచెయ్యండి" అని ఒకటి రెండు సార్లు అనడం

మాకుకూడా వినిపించాయి. అది విని మా బావ "చూచావు టోయ్ మీ అక్కయ్యకు నీమీద ఎంత ఆపేక్షో!" అన్నాడు. నేను ఉరుకోక "నా కోసం కాదయ్యా - రేపో ఎప్పుడో మీ చెల్లెలువస్తుందటగా అందుకూ అది సరేగాని-స్కూలు రీతులే కదా పోనీ వచ్చేయక పోయిందీ .. పైగా దగ్గర కదా - మరి నా విషయంలో అంత హడలగొట్టిన వాడివి చెల్లెలు విషయంలో..." అన్నాను. నేను మాటపూర్తి చెయ్యకముందే మా అక్కయ్య మా దగ్గరకు వచ్చి మా సంభాషణలు విన్నది కాబోలు "ఇవన్నీ మన దగ్గరేరా-అక్కడ సాగవు-అది ఈ అన్నగారి గారాబపట్టి. కొండమీదికోతి కావాలన్నా సరే తెచ్చిఇవ్వాలసిందే" అన్నది. "నిజమే-నువ్వన్నమాట అట్టేఅబద్ధం కాదు. అయితే చూచావ్- ఆ విశాఖపట్నపు కొండ మీదిది కావాలంటుందేమోనని భయంగా ఉన్నది" అని నా వంక తిరిగిచూచి పెద్దగా నవ్వేశాడు మా బావ.

ఛలోక్తులతో, ఉక్తిప్రత్యుక్తులతో గడిచిపోయింది చాలా సేపు.

నాకు మధ్యాహ్నం తిన్నవే సరిగా అరగలేదు. పైగా రాత్రిభోజనం. అందులో గారెలు ఒకటిరెండు ఎక్కువ తిన్నానేమో, కొంచెం వెగటనిపించినా తినేశానేమో కడుపు బరువుగా ఉన్నది. రేపు పొద్దుట కడుపునొప్పి వస్తుందేమో అనుకొని భయపడ్డాను.

వీథి వాకిలి గడియ వెయ్యబోయే సమయంలో మాధ్వా కరణం కేక వినిపించింది. పొమ్మంటే పోలే దా పిల్ల. గట్టిగా చెప్పి గడియవేసి వద్దామని మా అక్కయ్య అటు వచ్చింది. "పండగ్గదమ్మగోరూ ఇంత కణ్ణాం పడెయ్యరా" అంటూ ఆ పిల్ల ఎంతకూ వెళ్ళకపోతే "ఈ వచ్చేదేదో కాస్త ముందుగా రాలేక పొయ్యావ్" అని కొంచెం కోపగించుకొని మా అక్క లోపలకు వెళ్ళింది. నేనూ దానివెనుక లోపలికి వెళుతూ "పోన్లే అక్కయ్యా ఏదో చూచి కాస్త పడెయ్యి- పండగపూటా మరీ లేదనకూడదు కదా" అంటూ సర్ది చెప్పాలని ప్రయత్నం చేశాను. "నిజమేరా- మరి వాళ్ళు తలాకాస్త పట్టుకెళ్ళారు కదా" అంటూ మాఅక్కయ్య గిన్నెలు మూతలు తీసిచూచింది. చూచాక దానికి కోపమూ, చిరాకూ తగ్గాయి. ఓ వెండి పళ్ళెంలో ఇంత అన్నం పెట్టుకొని మిగిలిపోయిన కూరలూ పచ్చడీ దానిపైన పేర్చుకొని బయలుదేరి వెళుతుంటే నేను స్వతంత్రించి బుట్టలోంచి రెండు గారెలు తెచ్చి ఆ పళ్ళెంలో వేశాను. "అదేమిట్రా" అ టున్నట్లు మా అక్కయ్య నావంక చూచింది. "పోన్లే అక్కయ్యా - పండగపూటా ఒక్క గారె వేస్తే నీకే పుణ్యం - పద" అన్నాను. "నీ ధర్మచింతన మరీ బాగుంది. గారెలు వేస్తేనే గాని పుణ్యం రాదా ఏమిటి? ఏదో నీకిష్టమని ఓ నాలుగు ముక్కలు అట్టే పెట్టి ఉంచితే అందులో రెండు దానం చెయ్యడమా" అంటూనే పళ్ళెంలో ఉంచినవి

మళ్ళీ తియ్యడం ఇష్టంలేక ముందుకుసాగింది మరోఅప్పుడయితే అల్లా అనేది కాదు మా అక్కయ్య. పనివాళ్ళకూ వంటావిడకూ సొజ్జప్పాలూ అవీ పంచి ఇవ్వగా లేంది ఓ రెండు గారెలు ఇక్కడ వేస్తేమాత్రం ఏం - అనికాదు దాని ఆలోచన వేరు.

నేను మా అక్కయ్య వెంట మళ్ళీ వీథి గుమ్మందగ్గరకు వచ్చాను. దానికి తోడుగా ఉంటూ, దానితో మాట్లాడుతూ. అది మాట్లాడుతుంటే వింటూ అక్కడ ఉన్న నాలుగురోజులూ దాని వెంటే తిరుగుతూ, గడపడం నాకు చిన్నప్పటినుంచీ అలవాటు.

* * *

ఆ పిల్ల జోలె పట్టింది. అన్నం కూరా పచ్చడీ జోలెలో వేశాక ఆ జోలెలో కలగాపులగంగా ఉన్న మిగతా పదార్థాలతో కలిసిపోకుండా ఆ రెండు గారెలూ కాస్త విడిగా వేసింది మా అక్కయ్య.

ముఖంమీద పడుతున్న చింపిరిజుట్టు వెనక్కి నెట్టుకొని ఆ పిల్ల ఆ రెండు గారెల్నీ ఆప్యాయంగా స్పృశిస్తూ తల ఎత్తి ఎంతో ఆశ్చర్యంగా మా అక్కయ్య వంక చూచింది. కలిగిన ఆనందాన్నీ, కృతజ్ఞతనూ ఆ వెఱ్ఱిచూపులోనే మహా విచిత్రంగా, గొప్పగా వ్యక్తంచేసిందా పిల్ల. అంతలో అటు తిరిగి మాకు కొంచెం దూరంగా లాంతరు స్తంభం దగ్గరగా నిలబడ్డ తండ్రితో, పెద్దగా "అయ్యా ఈడ అమ్మగోరు

గాన్లేసుందే" అని కేకవేసి చెప్పింది. ఆ పిల్ల కేక విని అతను నెమ్మదిగా కర్ర నేలకు తాకిస్తూ మా వీథి అరుగుదగ్గరకు వచ్చి అరుగు అంచున కూర్చున్నాడు. ఆ పిల్ల పట్టరాని సంతోషంతో తండ్రితో ఆ విషయమే మళ్ళీ చెప్పింది. చెబుతూ జోలె అతని చేతిదగ్గరగా తీసికెళ్ళి, తన రెండో చేత్తో తండ్రి చెయ్యి పుచ్చుకొని అతని చేతివేళ్ళకు ఆ గారెలు తగిలేలాగున చేసింది. అతను "అవునే" అని ఓ క్షణం తర్వాత "నువ్వు తిందువుగాన్లే అమ్మా! ఇంటిది పొయ్యాక నీకు పలారం చేసిపెట్టినోళ్ళెరున్నారూ? పైగా రెండేళ్ళనుంచీ నా కీళ్ళజబ్బు ముదిరిపాయె అప్పటాలనుంచీ కళ్ళు అసలే కనబడకపొయ్యె - నీకేం తెచ్చిపెట్టకపోతిని" ఏదో సణుగుతున్నాడా ముసలివాడు. "నువ్వొకటి తిందువుగాన్లే అయ్యా - రెండూ నాకెందుకూ ఇంకా బోలెడు బువ్వుండెగందా" అంటోంది ఆ పిల్ల.

నేనింకా అక్కడే నిలబడిపొయ్యాను. మా అక్కయ్య కూడా అట్లాగే నిలబడిపోయింది. గుమ్మంక్రిందుగా అరుగు ప్రక్కన నిలబడ్డ ఆ పిల్ల మా విషయమే మరచిపోయినట్లున్నది. తండ్రితో ఏదో మాటాడుతున్నది.

ఒక్క నిముషం క్రిందట ఆ పిల్ల - చింపిరితల ఎగరేస్తున్న ఆ పిల్ల చినిగిన పరికిణీ, ఓణీలు వేసుకొనే ఈడు ఎప్పుడో వచ్చినా తప్పనిసరై మాసికలు కుట్టిన రెవిక తొడిగిన ఆ పిల్ల అన్న మాటలు....ఆ మాటలే నా చెవుల్లో ఇంకా ప్రతిధ్వనిస్తు

న్నాయి. ఎప్పటికప్పుడు కొ్రొత్తగా, అదే మొదటిసారా అన్నంత క్రొత్తగా విన్పిస్తున్నట్లు అనిపించింది. "ఏమి బీదరికం! ఈ పాడు బీదరికంలో రెండు గారెలు కంటపడేసరికే ఎంత సంబరం!" పేదరికాన్ని గురించి ఆలోచిస్తున్నాను. మా పెద్దక్క పెళ్ళికి మా నాన్నగారు "గొప్ప డిన్నరు" ఏర్పాటు చేశారు. విందుభోజనా లయ్యాక రెండు రోజులదాకా పిండి వంటలు అందరికీ పంచిపెడుతూనే ఉన్నారు మా యిట్లో. అప్పటి విషయం ఒకటి నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నది. "అన్ని గారెలు చేయించారు. బుట్టలో మిగిలిపోయాయి" అని సాధిస్తూ "ఏం చెయ్యమన్నా రివన్నీ - పంపవలసిన వాళ్ళందరికీ పంపాను. ఇప్పటికే రెండురోజు లయ్యింది. పిల్లలు అవి తిని జబ్బులు తెచ్చుకోగలరు - మీ పెద్దకొడుక్కు అప్పుడే అజీర్తి పట్టుకొన్నది - అవన్నీ ఏం చెయ్యమంటారో చెప్పండి" అని ఒకటికి రెండుసార్లు మా అమ్మ అనేసరికి మా నాన్నగారికి కోపంవచ్చి "దిబ్బమీద పారేయించు" అన్నారు. మా తాత గారు అడ్డుపడి తరుణోపాయం చెప్పి ఉండకపోతే మా నాన్న గారు అంతపనీ చేయించేవారే మా తాతగారు అప్పుడు ఏం ఉపాయం చెప్పి ఉంటారో అని ఆలోచిస్తూ మా అక్క కేమైనా తెలిసి ఉంటుందేమో దాన్ని అడుగుదామనుకొని దానివంక చూచాను. అదీ ఏదో ఆలోచనలో మునిగి ఉన్నది. ఏమాలోచిస్తున్నదో నాకైతే వెంటనే తెలియరాలేదు కాని

దాని వాలకంబట్టి చూస్తే ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లే అనిపించింది. చివరకు నేనే "ఏమిటే అక్కయ్యా అంతగా ఆలోచిస్తున్నావ్ ?" అన్నాను. అది నెమ్మదిగా "ఏం లేదురా చూశావా. తల్లిలేకపొయ్యేసరికి ఆ పిల్ల - వెధవ గారెముక్క కూడా ఎంత కరువ్వాచి పోయిందో !" అన్నది. దాని ఆలోచన అటుపోయింది. అంతలో మళ్ళా అందుకొని మా అక్కయ్య "మరీ ఆడపిల్లల విషయంలో - ఆ విషయం ఇట్టే పట్టేయచ్చురా" అన్నది.

క్రింద ఆ పిల్ల తండ్రి నోటికి ఓ గారె అందించి తినమని బలవంతం చేస్తోంది. అతను "వద్దే-నీకు ఉంచుకోవే మీఅమ్మైనా ఉంటే ఇంటికాడ అది చేసిపెట్టుకొంటదిలే అని నేను తిందును...." అంటూ నణుగుతూ ఆ గారె నోటికి తగులనీయ కుండా తల తిప్పేసుకొంటున్నాడు.

వాళ్ళిద్దర్నీ చూస్తూ అల్లా ఉండిపోయాను. నాకు తెలియ కుండానే నాలో ఏదో పొంగువస్తున్నది. ఆ దృశ్యం నన్ను ఎందుకో - ఎందుకో స్పష్టంగా చెప్పలేను గాని కదలించి వేసింది. ఎదురుగా ఆ వెట్టిపిల్ల చింపిరి తలతో, చినిగిన బట్టలతో, అసహ్యంగా ఉన్న ఆ పిల్ల, తండ్రిని ఆ గారె తినమని బ్రతిమి లాడుతున్న ఆ బీదపిల్ల కొంచెంసేపు తర్వాత నాకు కన్పించ లేదు. ఏమో అంటున్న ఆ ముసలితండ్రి మాటలు నాకు విన్పించలేదు.

పంచకొంగులతో కళ్ళు గట్టిగాతుడుచుకొన్నాను.

ఆ తండ్రీ కూతుళ్ళమధ్య వంతెనలా ఉండవలసిన ఆ బీదదాన్ని గురించీ, వాళ్ళ దారిద్ర్యాన్ని గురించీ ఆలోచిస్తున్నాను. "ఈ బీదపిల్లకు వెధవ రెండు గారెలు ఇంత ఆనందాన్ని కలిగింపగలిగాయి కదా" అనుకొన్నాను. "నాకు గారెలు ఈ పూట ఎంతో వెగటనిపించాయి కదా" అనుకున్నాను. అల్లా అనుకుంటూ గబగబా లోపలకు వెళ్ళి గారెలబుట్ట - బుట్టబుట్టా పట్టుకొనివచ్చి ఆ పిల్ల జోలెలో గుమ్మరించేశాను. ఆ పిల్ల "ఏందఁడోయ్-ఏందిది ?....కోపం వచ్చిందా ఏంటి ?" అంటూ దిమ్మరపోయి, నావంక చూస్తూ, నిలిచిపోయింది మరుక్షణంలో మా అక్కయ్య వంకకు తిరిగి "అమ్మగారూ చూశారా!" అంటున్నట్లు చూచింది. నేనూ మా అక్కయ్యవంక చూచాను.

మా అక్కయ్య గుమ్మానికి ఆనుకొని నిలబడి ఉన్నది. దాని కళ్ళవెంట ధారలు కడుతున్న కన్నీరు నాకు స్పష్టంగా కన్పించింది. మా అక్కయ్య నెమ్మదిగా "పట్టుకెళ్ళమ్మాయి. వాడికేం కోపం రాలేదులే - మిగిలిపోయినయ్యని మా తమ్ముడు నీకు కావాలనే ఇచ్చాడు. తీసుకెళ్ళు. ఇంటికి వెళ్ళి మీ అక్కయ్యకు పెట్టి నువ్వూ తినమ్మా - వెళ్ళు - వెళ్ళుపిల్లా" అన్నది. దాని గొంతులో వచ్చిన మార్పును గాని, దాని కన్నీరు గానీ ఆ పిల్ల గమనించే అవకాశం లేకపోయింది

ఆ పిల్ల తండ్రి చెయ్యి పుచ్చుకొని, బరువైన జోలె ఊగించుకొంటూ నెమ్మదిగా ముందుకు బయలుదేరి వెళుతూ, అంతలో వెనక్కి తిరిగి ఏదో జ్ఞాపకం వచ్చినదానిలాగా ముఖం పెట్టి మా అక్కతో "మీ తమ్ముడుగోరు ఇవన్నీ మా కెట్టేశా రని మరి మీ అమ్మగోరు కేకలేస్తుందేమో" అన్నది ఏదో భయ పడుతూ. అల్లా అని ఆ పిల్ల కొంచెం గబగబా అడుగులు వేస్తూ ముందుకు వెళ్ళిపోయింది. ఆ మాటకు మా అక్కయ్య దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది. "అదేమిటే - అక్కా" అంటూ నేనూ ఒకవంక పొంగివస్తున్న ఆవేశాన్ని అణచుకొంటూ దాన్ని సముదాయింప బోయాను. ఆ పిల్ల దారిద్ర్యం తను చూడలేకపోయింది కాబోలు అనుకొంటూ "ఊరుకోవే అక్కయ్యా" అంటుంటే మా అక్కయ్య చీరకొంగు నోట్లో కుక్కుకొంటూ "పిచ్చిపిల్ల- ఆ పిల్లకు తెలీదు కదా మనకూ...." అని ఇంక చెప్పలేక పోయింది.

నా స్థితి మరీ అయోమయమయిపోయింది. "ఊరుకోవే అక్కయ్యా నీదంతా మరీ పిచ్చి" అని అంటూ సముదాయిం చడానికి ప్రయత్నం చేస్తుండగా లోపల్నించి "ఏం చేస్తు న్నారర్రా ఇక్కడ?" అంటూ మా బావగారు మేం నిల్చున్న గుమ్మం దగ్గరకు వచ్చాడు.

మా యిద్దర్నీ చెరో చెయ్యి పుచ్చుకొని లోపలకు తీసుకొని వెళ్ళాడు మా బావ. విషయం తెలుసుకొని ఒక్క క్షణం ఆలోచనలోపడి అంతలోనే కొంచెం కోపం నటిస్తూ "అక్కా తమ్ముడూ మరీ అంతకంతకు చిన్నపిల్లలయిపోతున్నారు" అని కేక లేశాడు. హడావిడిగా కొంత సేపు అటూ ఇటూ తిరిగాడు. మా అల్లుణ్ణి నిద్రలేపి వాడికి చల్లగాలి తగలకుండా ఉండేందుకు కోటు వెయ్యమన్నాడు. అంటూ తాను దొడ్లోకి వెళ్ళి బండి వాణ్ణి లేపి బండి సిద్ధం చెయ్యమన్నాడు. ఒక్క నిముషంలో దొడ్లోంచి తిరిగి వస్తూ మా అక్కను పట్టుచీర కట్టుకొమ్మన్నాడు. రైలుకు పోతున్నంత హడావిడి చేసి మమ్మల్ని ఉన్న పళంగా బయలుదేరతీసి సినిమాకు తీసుకొని వెళ్ళాడు.

బండిలో కూర్చున్నాకకూడా మా అల్లుడికి ఇంకా నిద్ర మత్తుగానే ఉన్నది. "ముఖం కడుక్కోవాలి మామయ్యా - పేస్టు ఏదీ?" అన్నాడు. తను నిద్ర లేచాడు కనుక తెల్లవారిందనీ, తెల్లవారింది కనుక వెంటనే పళ్ళు తోముకోవాలనీ పట్టు పట్టాడు. వాడికి నచ్చచెప్పేందుకు చాలసేపు పట్టింది.

కుర్రవాడు - ఇంతలేడు - వీడిక్కూడా అప్పుడే దర్జా - "పేస్టు - పేస్టు కావాల్ట" అనుకొని నేను కావాలని నవ్వుకొన్నాను. సినిమాకు వెళ్ళి మూడు గంటలు అక్కడ కాలక్షేపంచేసి, సినిమా కొన్నిచోట్ల బాగాలేదనీ, కొన్ని దృశ్యాలూ, కొన్ని నాట్యాలూ బాగున్నాయనీ కబుర్లు చెప్పుకొంటూ

ఇంటికి తిరిగి వచ్చాక కాని మా అక్కయ్యా నేనూ మామూలు మనుష్యులం కాలేకపోయ్యాము. మొత్తంమీద మా బావగారి ప్రయత్నమూ వాడు సఫలం అయ్యింది.

*   *   *

ఇది జరిగి ఏనాో్న ఏళ్ళయింది. అసలు జరిగిందో లేదో కూడా జ్ఞాపకం లేకుండాపోవలసినంత కాలం గడిచిపోయింది. కాని....

ఇప్పటికీ పండుగరోజు అంటే నాకు భయం.

ఇప్పటికీ గారెలు నా కంటపడినప్పుడల్లా నాకు ఆ పిల్ల మాటలే చెవుల్లో గింగురుమంటాయి. అప్పటినుంచే అనుకొంటాను- నాకు గారె అంటేనే భయం. ఎందుకో గారె ముట్టనే ముట్టను. దానిమూలకంగా ఏవేవో జ్ఞాపకంవస్తాయని భయం కాబోలు - కాబోలు నాకైతే ఖచ్చితంగా తెలియదు. కాని - మొత్తంమీద అప్పట్నుంచే అనుకొంటాను నాకు గారె అరగదు.

———